అస్తవ్యస్తంగా ట్రాఫిక్

- కనిపించని సిగ్నల్ వ్యవస్థ
- దుకాణాల ముందు నిలిపిన వాహనాలకు చలాన్లు
- ఇదీ.. బోధన్ పోలీసు సిబ్బంది తీరు



బోధన్ పట్టణంలో సిగ్నల్స్ లేని కూడలి



బోధన్ పట్టణంలోని ఓ బ్యాంకు ఎదుట రోడ్డుపై నిలిపిన వాహనాలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతున్నది. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతుండడానికి తోడు, నిబంధనలను పట్టించుకునే వారు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్నది. బస్టాండ్ సమీపంలో రోజుకో రోడ్డు ప్రమాదం జరుగుతోంది. పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బోధన్ పట్టణానికి పక్కనే ఉన్న మహారాష్ట్రకు చెందిన వారితోపాటు ఆయా మండలాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. రోజుకు 8 వేల నుంచి 10 వేల ద్విచక్ర వాహనాలు రాకాపోకలు సాగిస్తాయి. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వ్యాపార, ఇతర అవసరాల నిమిత్తం ప్రజలు రాకాపోకలు సాగిస్తారు.

పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్ సమీపంలోని పెగడాపల్లి రోడ్డు, శక్కర్‌నగర్‌చౌరస్తా, కొత్త బస్టాండ్, అనీల్ టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ ప్రాంతాలు ప్రధాన కూడళ్లుగా ఉన్నాయి. ప్రతి రోజూ వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు ఉంటున్నప్పటికీ ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ వ్యవస్థ జాడలేకుండా పోయింది. ఆదివారం వచ్చిందంటే పట్టణంలోని పాత బస్టాండ్, అంబేడ్కర్‌చౌరస్తా, గోశాలరోడ్డు ప్రాంతాల్లో తలెత్తే ట్రాఫిక్ సమస్యను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

వాహనాలకు చలాన్లు

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించని పోలీసులు.. దుకాణాల ముందు నిలిపిఉంచే వాహనాలకు ఫైన్‌లు వేస్తున్నారని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాలతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేసే పోలీసులు తమ టార్గెట్లను చేరుకోవడానికి అడ్డగోలుగా ఫైన్‌లు వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తరువాతే వాహనదారులపై చర్యలు తీసుకోవాలంటున్నారు.

హోంగార్డులు ఎక్కడ?

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గతంలో ప్రత్యేక వ్యవస్థ ఉండేది. పోలీస్‌శాఖలో ఉన్న 40 మంది హోంగార్డులకు ప్రధాన కూడళ్ల డ్యూటీ వేసేవారు. ట్రాఫిక్ నియంత్రించే వ్యవస్థను తీసి వేసినప్పటి నుంచి ఇబ్బందులు తీవ్రమయ్యాయి. పట్టణంలో అనేక విద్య, వైద సంస్థలు ఉండడంతో సాయంత్రం 4 గంటలు దాటిందంటే విద్యార్థులు పట్టణంలోని ప్రధాన రహదారులైన బస్టాండ్, పాత బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తాల్లో గుంపులుగా వస్తారు. అదే సమయంలో ఆటోలు రోడ్డుకు అడ్డంగా ఉంచడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్స్‌తోపాటు ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతాం



ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన కూడళ్లుగా అంబేడ్కర్ చౌరస్తా, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాలను గుర్తించాం. రోడ్డుపై ఆటోలు నిలుపకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాపార సంస్థలు, బ్యాంకులు తమ పరిధిలో వాహనాలను నిలిపి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించాం. మున్సిపల్ అధికారుల సమన్వయంతో పార్కింగ్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు కృషి చేస్తాం. – ఎస్.వీరయ్య, పట్టణ సీఐ

క్లుప్తంగా

పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండల పాస్టర్స్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం బాల్కొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సొలెమాన్ రాజ్, ప్రధాన కార్యదర్శిగా స్టీఫెన్, ఉపాధ్యక్షుడిగా అనంత్ రావు, సహాయ కార్యదర్శిగా దేవానందం, కోశాధికారిగా కృపానందం, సహాయ కోశాధికారిగా రవికుమార్, సలహాదారునిగా రాజారత్నం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగనుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

బోధన్‌లో అన్నదానం



బోధన్‌టౌన్(బోధన్): లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఆదివారం అన్నదానం చేశారు. 70 మంది పేదలకు అన్నదానం చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ ప్రతినిధులు తెలిపారు. క్లబ్ జిల్లా చైర్మన్ జ్యోతిరాజ్, ప్రతినిధులు రమేశ్, రవీందర్, కటకం రమేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉపాసకురాలు మృతి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన గ్రామ దేవతల ఉపాసకురాలు శెట్టికుర్మ బుచ్చెక్క(65) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంతిమ సంస్కారాలను ఆదివారం గ్రామంలో నిర్వహించగా, వేలాది మంది పాల్గొన్నారు. ముత్యాలమ్మ ఉపాసకురాలైన బుచ్చెక్కను గ్రామస్తులు దైవంతో సమానంగా భావించేవారు. ఆమె అంతిమ సంస్కారాల్లో వీడీసీ అధ్యక్షుడు సాక్కం సంజీవ్, కిషన్‌గౌడ్, మెడికల్ గంగారెడ్డి, సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్దం రాజు, కే రమణ, మహేశ్, మహిపాల్, కురుమ కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

సిరికొండ: ఖమ్మంలో మార్చిలో నిర్వహించే మూడు విప్లవ పార్టీల ఐక్యత మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్ల రామకృష్ణ కోరారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఆదివారం ఆయన మహా సభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం విప్లవ పార్టీలు చీలిపోతున్న తరుణంలో దేశంలోని మూడు విప్లవ పార్టీలు రెండు సంవత్సరాల నుంచి చర్చలు జరుపుతూ విలీనానికి పూనుకున్నాయన్నారు. నారాగౌడ్, సాయారెడ్డి, లింబాద్రి, అనీస్, దామోదర్, కిషోర్, ఎర్రన్న, బాల్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌లో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు బోధన్ రూరల్ ఎస్‌ఐ నాగనాథ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద నుంచి రూ.21,050 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ గ్రామ చెరువులో ఆదివారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడు బోధన్ మండలం మినార్‌పల్లి సంగెంకు చెందిన నవీన్ (25)గా గుర్తించారు. నవీన్‌కు వివాహం జరిగిన ఆరు నెలలకే భార్యతో విడాకులు కావడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో గొడవ పడి, చెరువులో మృతదేహమై కన్పించాడు. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో 'స్వచ్ఛ కాలనీ – సమైక్య కాలనీ'



రోడ్డును శుభ్రం చేస్తున్న కాలనీవాసులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ కాలనీ – సమైక్య కాలనీ' 29 వారాలుగా కొనసాగుతున్నది. కాలనీ వాసులు ఆదివారం రోడ్ నంబర్.3లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా వారు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసుకొండ అశోక్, ప్రధాన కార్యదర్శి కమలాకర్, కొక్కెర భూమన్న, సత్యనారాయణగౌడ్, కొంతం రాజు, సాయన్న, రాజ్‌కుమార్, అవేజ్, ఎర్ర భూమయ్య, ఎస్సారెస్పీ డీఈ గణేశ్, ఎల్టీ కుమారస్వామి, బొల్లు జీవన్, ఖదీర్, భాజన్న తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాన్ని కాపాడాలి



నవీపేట : భారతదేశంలో పుట్టిన ప్రతి హిందువు.. హిందూ సంప్రదాయాన్ని కాపాడాలని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ వారె దస్తగిరి కోరారు. మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయం ఆవరణలో ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. టీవీ, సోషల్ మీడియాలో హిందూ ధర్మాన్ని వక్రీకరిస్తూ ప్రసంగాలు చేసే వారికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు జగదీశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల ప్రతినిధులు వసంత్‌కుమార్, దయానంద్, శేఖర్, మేక రమేశ్, కృతిక్, ఈశ్వర్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

యువత కీలకంగా వ్యవహరించాలి



యువకులతో మాట్లాడుతున్న పెద్దోళ్ల గంగారెడ్డి

మాక్లూర్: పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు యువమోర్చా కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అడవి మామిడిపల్లిలో బీజేపీ యువమోర్చా నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుంది? పార్టీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. భవిష్యత్‌లో బీజేపీ తిరుగులేని శక్తిగా మారుతుందన్నారు. బీజేపీ మండల నాయకులు గంగోనే సంతోష్, చింత ప్రవీణ్, గంగోనే వినోద్, రాజు, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులను మానవీయకోణంలో గౌరవించాలి



బోధన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులను మానవీకోణంలో గౌరవించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల ప్రతినిధులు అన్నారు. వేదిక రాష్ట్ర కమిటీ ముద్రించిన క్యాలెండర్‌ను పట్టణంలో నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, నెలకు కనీసం రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన దివ్యాంగులందరికీ ఇళ్ల స్థలాలు, సొంత స్థలాలు ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలన్నారు. చాలా మందికి సదరం మెడికల్ సర్టిఫికెట్లు లేక పింఛన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీములను అమలు చేయాలని కోరారు. వేదిక మండల గౌరవ అధ్యక్షుడు యేశాల గంగాధర్, ప్రతినిధులు గైని రాములు, షేక్ నజీర్, ఎల్లయ్య, బాలమణి, చింటూ, సాయినాథ్, సాయిలు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అనారోగ్యంతో ఆవు మృతి చెందింది. విషయం తెలుసుకున్న జిల్లా గో రక్ష సమితి, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు ఆదివారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గో రక్ష సమితి ప్రముఖ్ శ్రీధర్, కార్యదర్శి గాజుల దయానంద్, నగర అధ్యక్షుడు గట్టాడి గంగాచరణ్, కార్యదర్శి కొంగి రవి, వ్యవస్థా ప్రముఖ్ బోచ్కర్ నిఖిల్, అజయ్, పవన్, ప్రేమ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



రుద్రూర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



విజేతలతో విద్యానగర్ కాలనీ కమిటీ సభ్యులు



హొసాకొత్తూర్‌లో బహుమతుల ప్రదానం..

కమ్మర్‌పల్లి/రుద్రూర్/పెర్కిట్(ఆర్మూర్): సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు పోటాపోటీగా రంగులతో ముగ్గులు వేశారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాదేవస్వామి ఆలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, ప్రథమ బహుమతిని సీహెచ్ మాధవి, ద్వితీయ బహుమతిని ఆర్ వనిత, తృతీయ బహుతిని ఎం శ్రీనిధి కై వసం చేసుకున్నారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన సంజన, అనన్యకు వీడీసీ సభ్యులు బహుమతులు అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు రాజుల చిన్నబాలయ్య, కోశాధికారి రాధారపు నర్సయ్య, నాయకులు ఏనుగు రాజేశ్వర్, నోముల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన శృతి, లావణ్య, శ్రీలతకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప, కోశాధికారి లక్ష్మణ్, మహిళా సంఘం సభ్యులు సుశీల, వీరమణి, నాగమణి, లక్ష్మి, స్వప్న, శిరీష తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రీమియర్ గంగారెడ్డి, డమాకంర్ శ్రీనివాస్, కోటగిరి నర్స య్య, పొలాస లక్ష్మణ్, రఘుపతి, ధర్మపురి, సదానందం, గంగామోహన్, రాజా, గాయత్రి, విజయ, రాజ సులోచన, కవిత, నవనీత, విజయభారతి, వాహిని, అరుంధతి పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



జలాల్‌పూర్‌లో కల్యాణోత్సవం



జాన్కంపేట లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో..

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్/ఎడపల్లి/బోధన్‌రూరల్: గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లోని రంగనాథుని ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండపైనుంచి ఉత్సవ మూర్తులను తీసుకువచ్చి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ముప్కాల్ మండలం నల్లూర్ లడ్డా బాలాజీ, వెంచిర్యాల్ బంగారు వెంకన్న, వేంపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వరుని ఆలయాల్లో గోదారంగనాథుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని రామాలయంలో పురోహితుడు వెంకటరమణాచారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగా మో హన్‌చక్రు, కార్యదర్శి గుద్దేటి రమేశ్, కొక్కుల లింగం, లింబగిరి స్వామి, సుద్దాల శ్రీను, సతీశ్, ఆనంద్, సాయి, నర్సయ్య, డీకే శ్రీను తదితరులు పాల్గొ న్నారు. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట శివారులో ఉన్న లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో గో దారంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకోసం అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి గోదారంగనాథుల ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు.



జలాల్‌పూర్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



జలాల్‌పూర్‌లో కొండ పైనుంచి కిందికి వస్తున్న భక్తులు



బోధన్‌లోని వేంకటేశ్వర ఆలయంలో..

నేడు అయ్యప్ప ఆలయంలో హోమం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి రవీందర్ తెలిపారు. అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గణపతి హోమంతోపాటు అభిషేకం, నవగ్రహ పూజ, యజ్ఞ, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప భక్తులతోపాటు పట్టణ వాసుల హాజరు కావాలని కోరారు.

శివాలయంలో..

పట్టణంలోని నవనాథ సిద్ధేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



పెర్కిట్(ఆర్మూర్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో సామ తిరుపతిగౌడ్ జ్ఞాపకార్థం సుర్బిర్యాల్ ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. మొత్తం 16 జట్లు పాల్గొనగా.. యూత్ ఆఫ్ హిందుస్థాన్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకోగా, అరుంధతి యూత్ జట్లు రన్నరప్‌గా నిలిచింది. బెస్ట్ బ్యాటర్‌గా దాసరి శ్రీకర్, ఆల్‌రౌండర్‌గా మగ్గిడి అఖిల్ నిలిచారు. విజేతలకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు సట్లపల్లి గణేశ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, యువకులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – సైంధవ్ (తెలుగు)- 10.00, 1.00, 7.05, 10.05 మేరీ క్రిస్మస్ (తెలుగు) 4.00
- స్క్రీన్-2 – గుంటూరు కారం (తెలుగు)- 9.00, 12.20, 3.40, 7.00, 10.20
- స్క్రీన్-3 – గుంటూరు కారం (తెలుగు)- 09.10, 12.30, 3.50, 7.10, 10.30 నా సామిరంగ (తెలుగు) 10.45
- స్క్రీన్-4 – నా సామిరంగ (తెలుగు)- 10.20, 1.30, 4.40, 7.50 హనుమాన్ (తెలుగు) - 10.20

సంక్రాంతి సందడి



చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



వర్ని మండలం సత్యనారాయణపురంలో..

సాక్షి నెట్‌వర్క్ : పల్లెలు, పట్టణాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. మూడురోజుల పండుగ నేపథ్యంలో భోగి పర్వదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులకు భోగిపండ్లు పోశారు, చిన్నాపెద్ద తేడాలేకుండా పతంగులను ఎగురవేసి ఉత్సాహంగా గడిపారు. ఆర్మూర్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి, వేల్పూర్‌లో బాల్కొండ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొండి అశోక్ చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేశారు. పతంగుల దుకాణాల్లో జోరుగా విక్రయాలు సాగాయి. మూడు రోజుల సంబరాల్లో తొలి రోజు పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.





ఆర్మూర్ పట్టణంలోని గాలిపటాల దుకాణం వద్ద సందడి



వేల్పూర్‌లో గాలిపటాలతో చిన్నారులు..



సారంగాపూర్ హనుమాన్ ఆలయం ఆవరణలో..